క్లుప్తంగా

సామాజిక తనిఖీ



పాఠశాలలో రికార్డులను తనిఖీ చేస్తున్న స్టేట్ రిసోర్స్ పర్సన్ బృందం

జంగారెడ్డిగూడెం: బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో సామాజిక తనిఖీ నిర్వహించారు. స్టేట్ రిసోర్స్ పర్సన్ బృందం పి.ధనలక్ష్మి, జి.గోవింద్, పి.సుదర్శనం మధ్యాహ్న భోజన పథకం అమలు, పారిశుద్ధ్య నిర్వహణ, వసతులపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాల కమిటీ సభ్యులతో సమావేశమై వారి బాధ్యతల గురించి తెలియజేశారు. పాఠశాల అభివృద్ధికి చేపట్టాల్సిన అంశాలను వివరించారు. పాఠశాలకు అవసరమైన వసతులను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎంఈవో బి.రాముడు, హెచ్ఎం, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యా కమిటీ, తల్లితండ్రులు పాల్గొన్నారు.

ఆశ్రమ వార్షికోత్సవం



వెంకయ్యస్వామివారు

జంగారెడ్డిగూడెం: వెంకయ్యస్వామి ఆశ్రమ వార్షికోత్సవ వేడుకలు జనవరి 24వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం ఆరు గంటలకు స్వామి వారి పూజా కార్యక్రమాలతో వేడుకలు ప్రారంభమవుతాయని, ఏడు గంటలకు స్వామి వారికి అభిషేకాలు, ఎనిమిది గంటలకు అలంకరణ, తొమ్మిది గంటలకు దీపాలంకరణ, పది గంటలకు పూజా హారతి, 10 గంటలకు సహస్ర నామాలతో సామూహిక అగ్నిహోత్ర పూజ, 12 గంటలకు హారతి, స్వామి వారి ప్రసాత వితరణ, సత్సంగ, భజన, నామస్మరణ కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు.

వినతుల స్వీకరణ



కేఆర్‌పురం ఐటీడీఏలో వినతులను స్వీకరిస్తున్న పీఓ రాముల నాయక్

బుట్టాయగూడెం: గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తానని ఐటీడీఏ పీఓ కేతావతు రాముల నాయక్ అన్నారు. మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏలో బుధవారం నిర్వహించిన గిరిజన దర్బారులో ఆయన పలువురు గిరిజనుల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన వారికి న్యాయం చేస్తానని తెలిపారు.

అయ్యప్పకు ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం: మండలంలోని గురవాయిగూడెంలో వేంచేసియున్న శ్రీహరిహర సుత అయ్యప్ప స్వామి వారి దేవస్థానంలో బుధవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృత అభిషేకాలు, విశేష పూజల అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గ్రావెల్ ట్రాక్టర్ల సీజ్



సీజ్ చేసిన ట్రాక్టర్లు, జేసీబీ

వేలేరుపాడు: వేలేరుపాడు మండల పరిధిలోని కట్కూరు గ్రామ సమీపంలో ఆర్అండ్‌బీ రహదారుల మరమ్మతులకు గ్రావెల్ (కంకర మట్టి) తోలుతున్న ట్రాక్టర్లు, జేసీబీలను మంగళవారం అర్ధ రాత్రి వేలేరుపాడు తహసీల్దార్ సత్యనారాయణ సీజ్ చేశారు. మంగళవారం కట్కూరు సమీపంలో ఆర్అండ్‌బీ రహదారుల మరమ్మతులకు గ్రావెల్ తవ్వకాలు నిర్వహిస్తుండగా కుక్కునూరు ఫారెస్ట్ రేంజర్ ఫారెస్ట్ భూమిగా భావించి తవ్వకాలను నిలిపి వేశారు. తవ్వకాలు జరిపే ప్రదేశం రెవెన్యూ భూమి కావడంతో తహసీల్దార్‌కు ట్రాక్టర్లు, జేసీబీలను అప్పగించడంతో వాటిని సీజ్ చేసి, వేలేరుపాడు తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఆర్ఐ భుజంగరావు, వీఆర్వో చీమల వెంకటేశ్వర్లు, వీఆర్ఏ గణపతి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బుట్టాయగూడెం: మండలంలోని ఇప్పలపాడు సమీపంలో ఉన్న ఏకలవ్య మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ మిశ్రా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఫిబ్రవరి 19 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే ఫిబ్రవరి 25వ తేదీన దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

యాజమాన్య పద్ధతులు మేలు

టి.నరసాపురం: వ్యవసాయ అధికారులు సూచించిన విధంగా రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే చీడపీడల నుంచి రక్షణ పొందొచ్చని ఉద్యాన శాఖ అధికారి లక్‌పతి అన్నారు. టి.నరసాపురం మండలం బందంచర్లలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయిల్‌పామ్ తోటల్లో ఆకు తినే గొంగళి ఉధృతిని గుర్తించామన్నారు.

కాలుష్యపు కోరల్లో చెరువులు

- చెత్తాచెదారంతో నిండి దుర్గంధం
- దోమలకు ఆవాసాలుగా మారిన వైనం
- గుర్రపు డెక్కను తొలగించాలని వినతి



గుర్రపు డెక్కతో నిండిన చరవాయి చెరువు



చెత్తాచెదారం చేరి దుర్గంధం వెదజల్లుతున్న ముక్కుడు చెరువు

కామవరపుకోట: చేపలను పెంచి వాటి ద్వారా జీవనం పొందే వారికి, పశువులు నీరు తాగేందుకు ఆ చెరువులే ఆధారం. అలాంటి చెరువులు గుర్రపు డెక్కతో నిండిపోయాయి. ఈ చెరువులు రెండు గ్రామాలకు ఆనుకుని ఉండటంతో దుర్వాసనతో స్థానికులకు ఇబ్బందిగా మారాయి. కామవరపుకోట గ్రామ పంచాయతీ పాతూరు శివారు తహసీల్దార్ కార్యాలయ సమీపంలో గల ముక్కుడు చెరువు, అదే గ్రామ శివారులో ఉన్న చరవాయి చెరువు, ఆ రెండు చెరువులు గుర్రపు డెక్కతో నిండిపోవడంతో ఆ చెరువుపై ఆధారపడి జీవనం పొందుతున్న చేపల పెంపకందారులు, ఈ గుర్రపుడెక్క వలన చెరువులో వేసిన చేప పిల్లలు ఊపిరాడక చనిపోతున్నాయని, దీని వలన ఆర్థికంగా నష్టపోతున్నట్లు వాపోయారు. పశువులు నీళ్ల తాగేందుకు, వాటిని శుభ్రం చేసేందుకు ఆ చెరువు నీరే ఆధారమని స్థానిక పాడి రైతులు తెలిపారు. ఈ గుర్రపు డెక్క చెరువు నీటిపై ఆధారపడి పెరగడంతో చెరువులోని నీరు త్వరగా ఇంకిపోతుందని, దీనితో వేసవికాలంలో పశువులు తాగటానికి కూడా చెరువులో నీరు ఉండటం లేదని స్థానిక రైతులు వాపోతున్నారు. ఈ రెండు చెరువులు స్థానిక నివాసాలకు సమీపంలో ఉండటంతో దుర్గంధం వెదజల్లుతుందని, దోమలు విపరీతంగా పెరిగి రాత్రి సమయంలో నిద్ర పట్టడం లేదని, దోమలతో డెంగ్యూ వంటి విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో స్థానికులకు ఇబ్బంది లేకుండా ప్రతి ఏడాది గుర్రపు డెక్కను తొలగించి శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకునే వారని, కానీ ఇప్పుడు స్థానికులకు జీవనాధారమైన పశువులకు దాహార్తిని తీర్చేటువంటి ఈ చెరువులోని గుర్రపు డెక్కను తొలగించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని పలువురు విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే చెరువులోని గుర్రపు డెక్కను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

గుర్రపు డెక్కను తొలగించాలి



ఈ రెండు చెరువులు గుర్రపు డెక్కతో నిండిపోయాయి. నివాసాలకు ఆనుకుని ఉండటంతో దోమలు విపరీతంగా పెరుగుతున్నాయి. చెరువులోని చెత్తా, చెదారం కుళ్లి నిత్యం దుర్వాసన వస్తుంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక పశువులకు నీరు తాగడానికి ఈ చెరువులే ఆధారం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రెండు చెరువుల్లోని గుర్రపు డెక్కను తొలగించాలి.

– మాటూరి మురళి, స్థానికుడు, పాతూరు గ్రామం

వైభవంగా శోభాయాత్ర

కొయ్యలగూడెం: అయోధ్య బాల రాముని ప్రాణ ప్రతిష్ఠకు మొదటి వార్షికోత్సవం జనవరి 22వ తేదీన హిందూ బంధువులు పండగ వాతావరణంలో నిర్వహించుకున్నారని గారపాటి సీతారామాంజనేయులు (తపన చౌదరి) పేర్కొన్నారు. బుధవారం బయ్యనగూడెంలో పెద్ద రామాలయం నుంచి శోభాయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసి శతాబ్దాల నాటి హిందువుల కోరిక సాకారం చేసిన సందర్భంగా హైందవ దేశం యావత్తు సంతోషం వ్యక్తం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా వంద మందికి పైగా జాతీయ ప్రధాన రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. ముందుగా శ్రీపాద కృష్ణ ప్రభుదాసు శోభాయాత్రను ప్రారంభించారు. మద్దు తేజ విశ్వనాథ్, బాలం నరేష్, ఆరేటి ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు మహిళలపై వీధి కుక్కల దాడి

ద్వారకాతిరుమల: మండలంలోని దొరసానిపాడు, ద్వారకాతిరుమల గ్రామాల్లో బుధవారం ఇద్దరు మహిళలపై వీధి కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో దొరసానిపాడుకు చెందిన ఎం.నాగేశ్వరి, ద్వారకాతిరుమలకు చెందిన జి.వరలక్ష్మి తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు ద్వారకాతిరుమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు.

పంచాయతీ బోరు.. పొలాలకు నీరు



పొలానికి మళ్లిస్తున్న పంచాయతీ బోరు నీరు

కొయ్యలగూడెం: కన్నాపురంలో పంచాయతీ తాగునీటి బోరు నుంచి సరఫరా అవుతున్న నీరు పంట పొలాలకు వాడుతున్న విషయం తీవ్ర దుమారం రేపుతుంది. మహదేవపురం రోడ్డులో ప్రగతి నగర్ ప్రాంతంలో ప్రజల కోసం గతంలో నిర్మించిన తాగునీటి బోరు ద్వారా సరఫరా అవుతున్న నీరు పంట పొలాలకు తరలించడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయంపై పంచాయతీ బోరు నీటిని పొలానికి మళ్లించిన వ్యక్తిని ప్రజలు ప్రశ్నించగా బోరు నిర్మాణం తన భూమిలో జరిగిందని పేర్కొంటూ అది తన ఇష్టం ప్రకారం నీటిని వినియోగిస్తానని సదరు రైతు ఘర్షణాత్మకంగా మాట్లాడుతున్నాడని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ సమస్యపై పంచాయతీ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు పేర్కొన్నారు. గత రెండేళ్లుగా ప్రజలకు తాగునీరు రోజుకు కేవలం రెండు గంటల పాటే అందుబాటులో ఉండటంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్రంగా నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీలోని పెద్దల ప్రోద్బలంతోనే పొలం గల రైతు దౌర్జన్యంగా ప్రవర్తిస్తున్నాడన్నారు. ఈ సమస్యకు తక్షణమే పరిష్కారం చూపాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి



కరపత్రాను ఆవిష్కరిస్తున్న నాయకులు

జంగారెడ్డిగూడెం: కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఉద్యోగ కార్మిక వర్గాలపై కార్పొరేట్ సంస్థల దాడికి వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ పిలుపు మేరకు మార్కెట్ యార్డ్‌లో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీ రమణ మాట్లాడుతూ భారత కార్మిక వర్గం అనేక సంవత్సరాలుగా పోరాటాలు చేసి త్యాగాలు చేసి సాధించుకున్న 44 లేబర్ చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. యాజమాన్యాలకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్లు తెచ్చారని, ఆ లేబర్ కోడ్లను ఏప్రిల్ ఒకటి నుంచి అమలు చేయాలని కేంద్రం యోచిస్తుందన్నారు. ఇటీవల ఇన్ఫోసిస్ నారాయణ కార్మికుడు వారానికి 72 గంటలు పని చేయాలని చెబితే ఎల్అండ్‌టీ అధినేత ఇంటి దగ్గర భార్యను చూసుకొని ఉండటం కాదని వారానికి 90 గంటలు పని చేయాలని ఉద్యోగ కార్మిక వర్గాన్ని అవహేళన చేస్తూ మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రమణ డిమాండ్ చేశారు. అనంతరం జాతీయ కమిటీ ప్రచురించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ముప్పిడి అబ్బులు, గంపల వెంకటేష్, పాడిదోలు దుర్గారావు, ముప్పిడి రంగారావు, దొండపాటి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వేశారు.. తారు మరిచారు



కొత్తగా వేసిన రోడ్డులో పైకి తేలిన కంకర రాళ్లు

కామవరపుకోట: మూడు దశాబ్దాలుగా రోడ్డు నిర్మాణానికి నోచుకోని కామవరపుకోట నుంచి అంకలంపాడు, జలపవారిగూడెం, కేఎస్ రామవరం వరకు గల రోడ్డు నిర్మాణ పనులను ఇటీవల కాలంలో చేపట్టారు. ఇది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.7.40 కోట్ల నిధులు కేటాయించి, మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబు శంకుస్థాపన చేశారు. అయితే ఇప్పుడున్న ప్రభుత్వం హడావుడిగా పనులు ప్రారంభించారు. కంకర పోసి తారు వేయటం మానేశారు. దీంతో రోడ్డు మొత్తం కంకర రాళ్లు పైకి లేచి ఉండటంతో ఆ ప్రాంత వాసులు ప్రయాణం చేయాలంటేనే నరకం అనుభవిస్తున్నారు. రాత్రి అయితే ఆ రోడ్డులో ప్రయాణం మరీ ఇబ్బందిగా ఉంటుందని ద్విచక్ర వాహనదారులు వాపోతున్నారు. కళాశాలలకు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు, స్పందించి రోడ్డు నిర్మాణ పనులను చేపట్టి పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

పశు వైద్య శిబిరం ఏర్పాటు



మంగపతిదేవిపేటలో నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరం

కొయ్యలగూడెం: పశు వైద్యశాలలో సిబ్బంది కొరత లేకుండా పశు వైద్య శాఖ అధికారులతో పాటు దిగువ స్థాయి సిబ్బందిని భర్తీ చేయాలి అని ఎంపీటీసీ, మాజీ సర్పంచ్ తేలే శ్రీనివాస్ అన్నారు. బుధవారం మంగపతిదేవిపేట గ్రామంలో మండల పశు వైద్యశాఖ అధికారి బీఆర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని ఆయన సర్పంచ్ అబ్బు సుబ్రహ్మణ్యంతో కలిసి ప్రారంభించారు. పశువులకు సంక్రమిస్తున్న వ్యాధుల వలన మండల కేంద్రం లేదా గ్రామానికి దూరంలో ఉండే పశు వైద్య కేంద్రాలకు తీసుకు వెళ్లడానికి రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి అన్నారు. ఈ సందర్భంగా 54 మంది రైతులకు సంబంధించిన 300లకు పైగా పశువులకు, దూడలకు నట్టల నివారణ మందులును ప్రజా ప్రతినిధులు అందజేశారు. 21 గర్భకోశ పరీక్షలు చేసి, చికిత్స అందించారు. రెండు వేలకు పైగా గొర్రెలు, మేకలకు పాక్స్ వాక్సిన్లు వేశారు. అదే విధంగా 500 కోళ్లకు టీకాలను వేశారు. కార్యక్రమంలో ఎ.కృష్ణమోహన్, కె.వాసవి, వీరబాబు, రవికిరణ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాల పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న జిల్లా కమిటీ బృందం

వేలేరుపాడు: సీపీఐఎంఎల్ మాస్‌లైన్ అనుబంధం ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వేలేరుపాడు ప్రభుత్వ వైద్యశాలలోని సమస్యలపై బుధవారం సర్వే చేసింది. ఈ సందర్భంగా పీఓడబ్ల్యూ ఏలూరు జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సోడే విజయ, ఎస్‌కే మున్నీ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాల భవనం గోదావరి ముంపులో ఉండటం వలన హాస్పిటల్‌ను తరలించి బీసీ సంక్షేమ హాస్టల్‌లో పెట్టారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ సెలవు పెడితే ప్రత్యామ్నాయంగా ఎవరూ ఉండటం లేదన్నారు. 108 వాహనం వెలేరుపాడు, కుక్కునూరు హాస్పిటల్స్‌కు ఒక్కటే ఉండడం వలన, అత్యవసర పరిస్థితిలో ఆటోలు, ఇతర వాహనాలు ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. పీఓడబ్ల్యూ జిల్లా నాయకురాలు కారం సత్యవతి, కట్టం రత్తమ్మ, మడివి రంగమ్మ, మడివి కన్నమ్మ, మచ్చా సుభద్ర, ఎం.లక్ష్మి పాల్గొన్నారు.

సారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు



టి.నరసాపురం: తహసీల్దార్ కోర్టులో ముద్దాయిలను బైండవోర్ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

బుట్టాయగూడెం: మండలంలోని మొద్దప్పగూడెం సమీపంలో సారా తయారీ కేంద్రాలపై ఎక్సైజ్ అధికారులు బుధవారం దాడి చేశారు. ఈ దాడిలో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.వీరబ్రహ్మం తెలిపారు. గుట్టు చప్పుడు కాకుండా అక్రమంగా సారా తయారు చేసి విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ దాడులు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఈఎస్‌డీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.సత్యవతి, ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ పీఎస్‌డీ భోగేశ్వరరావు, పోలవరం, ఏలూరు, ఎక్సైజ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సారా ముద్దాయిల బైండోవర్

టి.నరసాపురం: మండలంలో చింతలపూడి ఎక్సైజ్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. మండలంలోని తిరుమలదేవిపేట గ్రామంలో నిర్వహించిన దాడుల్లో మధ్యాహ్నపువారిగూడేనికి చెందిన కటారి కృష్ణను అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 20 కేజీల బెల్లం, కేజీ అమ్మోనియా, 250 గ్రాముల పటిక స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. మధ్యాహ్నపువారిగూడెం, కన్నప్పగూడెం గ్రామాలకు చెందిన పాత సారా కేసుల నిందితులు కటారి కృష్ణ, కటారి నాగలక్ష్మి, పాయం వెంకటేశ్వరరావులను టి.నరసాపురం తహసీల్దార్ ముందు హాజరుపరిచి బైండోవర్ చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు ఆర్‌వీఎల్ నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం



జంగారెడ్డిగూడెం: బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు



బుట్టాయగూడెం: బెల్లపు ఊటను పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు

జంగారెడ్డిగూడెం: ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో బుధవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెంలో దాడులు నిర్వహించి, సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ద్వారకాతిరుమల: సీజీఆర్ఎఫ్, ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు సీజీఆర్ఎఫ్ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. ద్వారకాతిరుమల మండల పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు ద్వారకాతిరుమల మండల విద్యుత్ శాఖ ఆఫీసు ఆవరణలో కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ, ఎస్.మసీలమణి, షేక్ బాబర్, ఎస్.మురళీకృష్ణ హాజరువుతున్నారని తెలిపారు.

లెనిన్‌కు ఘన నివాళి

జంగారెడ్డిగూడెం: రష్యా విప్లవ యోధుడు కమ్యూనిస్టు సిద్ధాంత కర్త కామ్రేడ్ వీఐ లెనిన్ శత జయంతి కార్యక్రమాన్ని సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎం.జీవరత్నం లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ లెనిన్ చిన్నతనం నుంచి సేవా కార్యక్రమాలు, కారిమ్రిక దృక్పథంతో నడిచారని తెలిపారు. రష్యాలో కమ్యూనిస్టు పార్టీని అధికారంలోకి తెచ్చిన వ్యక్తి లెనిన్ అని కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ పి.సూర్యారావు, మండల కమిటీ సభ్యులు జె సూర్యచంద్రం, ఏ.ప్రభాకర్‌రావు, వై.సీత, పటాన్ మస్తాన్, ఎన్.వెంకన్న, కె.సుబ్బారావు, డి.ఆశీర్వాదం, పి.సునీల్ పాల్గొన్నారు.

ప్రమాదపుటంచున ప్రయాణం



గ్యాస్ సిలిండర్లు సరఫరా చేసే ఆటోలో ప్రయాణిస్తున్న మహిళలు

కామవరపుకోట: రోడ్డు ప్రమాదాల బారిన పడి రోజుకి ఎంతో మంది గాయాల పాలై ప్రాణాలు కోల్పోతున్నా కొంత మంది వాహన చోదకుల తీరు మారడం లేదు. ఇటువంటి ఘటనే బుధవారం కామవరపుకోట నుంచి చింతలపూడి వెళ్లే రహదారిలో మండలంలోని గుంటుపల్లి సమీపంలో బుధవారం కనిపించింది. కామవరపుకోట నుంచి చింతలపూడి వైపు వెళుతున్న భారత్ గ్యాస్ సిలిండర్లను సరఫరా చేసే ఆటోలో సిలిండర్లపైన ప్రమాద భరితంగా కొంతమంది మహిళలు కూర్చుని, ఆటోకు చివర నిలబడి ప్రయాణిస్తున్నారు. ఇలా రోడ్డుపై ప్రయాణించడం చూసి స్థానికులు అవ్వాకయ్యారు. అసలే ఈ రోడ్డు మొత్తం గుంతలు పడి రహదారి మొత్తం అధ్వానంగా ఉంది. ఇలాంటి ప్రమాదకర రహదారిలో ఇలా వాహనాలు నడపటం పట్ల స్థానికులు విస్మయం వ్యక్తం చేశారు. పొరపాటున ఏదైనా జరిగితే పరిస్థితి ఏమిటని ఆటో యజమానిపై చర్య తీసుకోవాలని ఆ రహదారి గుండా ప్రయాణించిన పలువురు వాహనదారులు కోరుతున్నారు.

రక్తదానం.. ప్రాణదానం



రక్తదాతను సన్మానిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: రక్తదాతలు ప్రాణదాతలతో సమానం అని తపన ఫౌండేషన్ చైర్మన్ గారపాటి సీతారామాంజనేయ చౌదరి బుధవారం పేర్కొన్నారు. కేతవరం గ్రామానికి చెందిన పెద్దమల్ల బాలు అనేదాతను ఆయన బయ్యనగూడెంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో సత్కరించారు. ఇప్పటివరకు అత్యధికంగా 35 సార్లు రక్తదానం చేశారని సోషల్ వర్కర్ ఆరేటి ఏసుబాబు ద్వారా తెలుసుకున్న ఆయన బాలు దాతృత్వాన్ని కొనియాడారు. బయ్యన్నగూడెంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో సత్కరించారు. వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

జంగారెడ్డిగూడెం: గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జెడ్పీ సీఈవో, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా కోఆర్డినేటర్ కె.సుబ్బారావు అన్నారు. జంగారెడ్డిగూడెం ఎంపీడీవో కార్యాలయంలో డివిజన్ పరిధిలోని 10 మండలాల ఎంపీడీవో, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ లబ్ధిదారులను వివరాలను జియో ట్యాగింగ్, అంగన్వాడీల కేంద్రం పరిధిలో బాల ఆధార్ నమోదు, జాబ్‌కార్డుల వెరిఫికేషన్ తదితర పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఎంపీడీవోలు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో డివిజనల్ అభివృద్ధి అధికారి ఎం.రాజు, డివిజన్‌లోని ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

విజయోత్సవ సభ

జంగారెడ్డిగూడెం: వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నిర్వహించిన హైందవ శంఖారావం విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు అని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి తనికెళ్ల సత్య రవికుమార్ అన్నారు. హైందవ శంఖారావం సభ విజయవంతమైన సందర్భంగా జంగారెడ్డిగూడెం పట్టణంలోని ఏలూరు రోడ్ మల్లాది సీతారామలింగేశ్వర రోటరీ కమ్యూనిటీ హాల్‌లో విశ్వ హిందూ పరిషత్ విజయోత్సవ సభ నిర్వహించారు. పలు హిందూ సంస్థలకు చెందిన ప్రతినిధులు కార్యకర్తలతో ఆయన మాట్లాడుతూ హిందువులు సంఘటితం కావాలన్నారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ రాష్ట్రీయ స్వయం సేవక సంఘం, సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.